# దాటేసిన రోజులు

అనేకానేక దృశ్యాలు
రైలు కిటికీ కళ్ల ముందు
వెలుగులో మెరుస్తూ
చీకటిలో కలుస్తూ
ధూళిలో కొట్టుకుపోతూ
కనుమరుగవుతున్నట్టు
అచ్చొచ్చినా అగాధంలోకి తోసినా
ఆగిపోలేదు కదా రోజులు
అయినా నెట్టేసు కొచ్చిన రోజుల్ని
నెమరేసుకోవడానికి
నీకు నాకు తీరికేది?
మన ఆరాటం , పోరాటం అంతా
రాబోయే రోజుల కోసమే కదా!
అలసిపోతున్నా ఆగకుండా పోతున్న జీవన స్రవంతిలో
ఎప్పుడో ఎత్తుకు తిప్పిన ఎదురింటి పిల్లలు
పోల్చుకున్నారా అని పలకరించినప్పుడో
ఒకప్పుడు అమితంగా ఆరాధించిన అమ్మాయి
దీనంగా కళావిహీనంగా
సంసార భారంతో కళ్లముందునుండే
కదిలి పోతున్నప్పుడో
పాత పుస్తకాలో, డైరీలో, ఫోటోలో
తిరగేస్తున్నప్పుడో
పాత మిత్రులెవరో కలిసినప్పుడో
మసక మసకగా మస్తిష్కం నిండా

గతం గిరికీలు కొడుతుంది
అందీ అందని జ్ఞాపకాల లోతుల్లోకి తోస్తుంది
లోపల లోలోపల ఇంకా లోపల పొరల పొరల్ని
మెరుపు వేగంతో
చీల్చుకుంటూ తప్పుకుంటూ వెదుక్కుంటూ
అప్పటి కావలసిన చిత్రావశేషం
దొరికో దొరక్కో బయట పడి తేరుకునే సరికి
ఇదేమిటి?
ఒళ్లంతా గతం మరకలు
వయస్సుని గుర్తుచేస్తున్నట్టు చురకలు